పైప్‌లైన్లలోకి మురుగునీరు
తాగునీరు గరళం

అది నగరం పుట్టినప్పటి ప్రాంతం. టౌన్ అనే పదం తొలినాళ్లలో ఆ ప్రాంతాన్ని ఉద్దేశించే అనేవారు. అదే పాతనగరం.. కాస్త పెద్ద వయసు వారిని ఎవరిని అడిగినా పాతనగరం గురించి కథలు కథలుగా చెబుతారు. ఆధ్యాత్మికంగా.. వాణిజ్యపరంగా.. సాంస్కృతికంగా ఆ ప్రాంతం ఎంతో పేరున్నది. అయితే కాలం మారి ఇప్పుడు ఆ ప్రాంతం తన పేరులాగే పాతబడిపోయింది. అక్కడ జీవించే వారికి కనీస సదుపాయాలు కూడా అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ముఖ్యంగా స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆ ప్రాంతవాసులు అల్లాడుతున్నారు. అక్కడ ఎప్పుడో వేసిన తాగునీటి పైప్‌లైన్లు శిథిలమై మురుగునీరు కలిసిపోయి ఇళ్లలోకి సరఫరా అవుతోంది. ఆ నీరు తాగి స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారు.



వెలంపేటలో కాలువపై ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్లు

- పాతనగరంలో కలుషితమవుతున్న తాగునీరు
- వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికుల ఆవేదన
- పట్టించుకోని అధికారులు

జగదాంబ: పాతనగరవాసులు స్వచ్ఛమైన తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఇక్కడ దాదాపు అన్ని ప్రాంతాల్లోను పైప్‌లైన్లు మురుగు కాలువల్లోను.. వాటి పరిసరాల్లోనే ఉన్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో స్థానికులు ఆ నీటినే తాగుతున్నారు. దీంతో వ్యాధులకు గురవుతూ ఇబ్బంది పడుతున్నారు. ఎప్పుడో పురాతన కాలంలో ఏర్పాటు చేసిన ఆ పైపులైన్ల ద్వారానే పాతనగరానికి తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఏళ్లు గడిచినా వాటి గురించి అధికారులు ఆలోచన చేయలేదు. దీంతో పాతనగరంలోని చాలా ప్రాంతాల్లోని మంచినీటి పైప్‌లైన్లు శిథిలమయ్యాయి. కాలువల్లో మురుగు నీరు తాగునీటి పైప్‌లైన్లతో కలవడం వల్ల నీరు కలుషితం అవుతోంది. ఆ నీటిని తాగడం వల్ల పాతనగరవాసులు రోగాల పాలు అవుతున్నారు.

నిర్లక్ష్యం తగదు..

నగరంలో అన్ని ప్రాంతాల కంటే ముందు ఏర్పడిన పాతనగరం అభివృద్ధిలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీని కంటే తర్వాత ఏర్పడిన ప్రాంతాలను మాత్రం త్వరితగతిన అభివృద్ధి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు, అధికారులు ఉండే ప్రాంతాలనే అభివృద్ధి చేస్తున్నారని.. పేదలుండే మురికివాడలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇంకా ఎన్నేళ్లు ఈ దుస్థితి అని మండిపడుతున్నారు.

పూర్ణామార్కెట్ పరిధి పలు ప్రాంతాల్లో..

జోన్-4 పరిధిలో ఉన్న జబ్బర్‌తోట, గొల్లవీధి, ఎల్లమ్మతోట, పూర్ణామార్కెట్ పరిధిలోని పలు ప్రాంతాలు, లక్ష్మీనగర్, ఆర్ఆర్ఎంఆర్ రోడ్డు, వెలంపేట, పండా వీధి, ప్రసాద్‌గార్డెన్స్, దుర్గమాంబ సమాజం, కోటవీధి, పంజావీధి, థామ్సన్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లోని తాగునీటి పైప్‌లైన్లు శిథిలమయ్యాయి.

మురుగు కాలువల్లోనే..

ఇప్పటి కార్పొరేషన్ మొదట మున్సిపాలిటీ స్థాయిలో ఉన్నప్పుడు ఈ పైపులైన్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ పైపులైన్లు మార్చలేదు. ఫలితంగా ఆ పైప్‌లైన్లు చాలా చోట్ల శిథిలమయ్యాయి. దీంతో మురుగు నీరు.. మంచినీరు కలిసిపోయి స్థానికులకు సరఫరా అవుతోంది. పాతనగరంలో ఎక్కడో ఒక చోట తాగునీటి సరఫరాలో మురుగు నీటి వ్యర్థాలు వస్తూనే ఉన్నాయి. ఈ విషయంపై జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా నీటిలో బ్లీచింగ్ పౌడర్ కలుపుతారు తప్ప శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోరని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్..

ఇటీవల జోన్-4 పరిధిలో తాగునీటి సరఫరాలో మురుగు నీరు కలిసిపోవడంతో జబ్బర్‌తోట, గొల్లవీధి ప్రాంతాల్లో డయేరియా ప్రబలి ప్రజలు అవస్థలకు గురయ్యారు. దీంతో జీవీఎంసీ కమిషనర్ స్పందించి వెంటనే తాగునీరు సరఫరా అవుతున్న పైపులైన్లను పర్యవేక్షించాలని ఆదేశించారు. కానీ జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులు ఇప్పటికీ పాతనగరంలో ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. మళ్లీ ఎక్కడైనా డయేరియా వంటివి ప్రబలితేనే వారు వస్తారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలే బేఖాతారు చేస్తే తమ గోడు ఎవరు వింటారని ప్రశ్నిస్తున్నారు.



ఆర్ఆర్ఎం రోడ్డులో మురుగు కాలువ మీదుగా ఏర్పాటు చేసిన పైపులైన్లు

పైపులైన్ల వ్యవస్థను మార్చాలి..

విద్యుత్, టెలిఫోన్, సెల్ టవర్ల ఏర్పాటు.. ఇలా అన్నింటి కోసం ప్రత్యేకంగా లైన్లు వేస్తున్నారు. ప్రజల కనీస అవసరమైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోలేరా? అని పాత నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. శిథిలమై.. మురుగు నీరు సరఫరా చేస్తున్న పాత పైప్‌లైన్లను మార్చి కొత్తవి వేయాలని కోరుతున్నారు.

ధర్నాలు చేశాం..



తాగునీటిలో వ్యర్థాలు కలుస్తున్నాయని.. ఆ నీటిని తాగలేకపోతున్నామని అనేక సార్లు ధర్నాలు చేశాం. అయినా స్పందన లేదు. ఫిర్యాదు చేసిన ప్రతిసారీ బ్లీచింగ్ కలిపి నీటిని సరఫరా చేయడం తప్ప పైప్‌లైన్ల మరమ్మతులు చేయడంలేదు. తప్పనిసరి అయి ఆ నీటినే తాగుతున్నాం.

–రమణమ్మ, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు

కొత్త పైపులైన్లు వేయాలి..



ఎంతో కాలంగా పైపుల ద్వారా తాగునీటితో పాటు మురుగు నీరు వచ్చేస్తోంది. దీంతో ఎన్నోసార్లు అనారోగ్యానికి గురయ్యాం. పిల్లలతో పాటు కుటుంబం అంతా కలుషిత నీరు తాగి వ్యాధుల బారిన పడ్డాం. ఇప్పటికైనా అధికారులు పాతనగరంలో కొత్త పైపులైన్లు వెయ్యాలి.

–రామలక్ష్మి, వెలంపేట, జీవీఎంసీ 35వ వార్డు

మినరల్ వాటర్ అడుగుతున్నామా?



అందరు ఆరోగ్యం కాపాడుకోవాలని చెబుతారు కానీ ఆ దిశగా చర్యలు తీసుకోరు. తాగునీటి కోసం మినరల్ వాటర్ ప్లాంట్లు పెట్టకపోయినా కనీసం మురుగు నీరు కాకుండా మంచినీరు సరఫరా చేస్తే చాలు. జీవీఎంసీ పాలకవర్గం, అధికారులు స్పందించి మాకు స్వచ్ఛమైన తాగు నీరు అందించాలి.

– అరుణ, ప్రసాద్‌గార్డెన్స్, జీవీఎంసీ 35వ వార్డు

క్లుప్తంగా

విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి



వివరాలు వెల్లడిస్తున్న బ్రహ్మకుమారీస్ నిర్వాహకురాలు రమాదేవి

అల్లిపురం: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సారథ్యంలో విశాఖలోని సింహాచలం పుణ్యక్షేత్రంలో జ్ఞాన విజ్ఞాన కేంద్రం ఆధ్యాత్మిక మ్యూజియం, ప్రథమ చికిత్సాలయం ఏర్పాటుకు కావాల్సిన స్థలం కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వినతిపత్రం ఇవ్వనున్నట్లు బ్రహ్మకుమారీస్ నిర్వాహకురాలు రమాదేవి తెలిపారు. ఈ మేరకు బుధవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. గురువారం నగరానికి రానున్న ముఖ్యమంత్రి చంద్రబాబును తాము కలిసి వినతిపత్రం అందజేయనున్నట్లు వివరించారు. సెప్టెంబర్ 27వ తేదీన ఒకసారి వినతి పత్రం ఇచ్చామన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర క్యాబినెట్ మంత్రుల సమావేశంలో కూడా రెవెన్యూ మినిస్టర్‌కు సింహాచలం కొండ దిగువన ఆధ్యాత్మిక జ్ఞాన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసేందుకు స్థలం కేటాయించాలని కోరుతూ వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సమావేశంలో సంఘమిత్ర సోషల్ సర్వీసెస్ సూరిబాబు, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి నారాయణమూర్తి, మణి తదితరులు పాల్గొన్నారు.

నేడు కళాభారతిలో నాటికల ప్రదర్శన

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో రెండు సాంఘిక నాటికలు ప్రదర్శించనున్నామని వీఎండీఏ కార్యదర్శి డాక్టర్ గుమ్ములూరి రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విజయనగరానికి చెందిన నాటకశాల నట సేవా సమాజం వారిచే రాయి అనే నాటిక ప్రదర్శించనున్నామని చెప్పారు. ఇఎస్ గోపాలరాజు కలం నుంచి జాలువారిన కథకు గెద్ద వరప్రసాద్ దర్శకత్వం చేయనున్నారన్నారు. నాటికలో 8 మంది నటీనటులున్నారని పేర్కొన్నారు. రెండోదిగా గెద్ద కిషోర్ రచించిన బంధనం నాటికను గెద్ద వరప్రసాద్ దర్శకత్వంలో ప్రదర్శించనున్నామన్నారు. దీనిలో ఐదుగురు నటీనటులున్నారని చెప్పారు. ఈ ప్రదర్శనలకు అందరూ ఆహ్వానితులేనని ఆయన అన్నారు.

'సౌందర్యలహరి' పుస్తకావిష్కరణ నేడు

మద్దిలపాలెం: విశాఖ సాహితీ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో శుక్రవారం సౌందర్యలహరి పుస్తకావిష్కరణ సభ జరగనుందని తెలుగుదండు పద్య పీఠం ప్రతినిధి పరవస్తు ఫణిశయన సూరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా డాక్టర్ కందాళ కనకమహాలక్ష్మి వ్యవహరిస్తారన్నారు. సమస్యాపృచ్ఛక చక్రవర్తి కంది శంకరయ్య చేతుల మీదుగా పుస్తకావిష్కరణ జరుగుతుందని చెప్పారు. విశిష్ట అతిథిగా ఆధ్యాత్మిక ప్రచారకులు పింగళి జానకీలక్ష్మి హాజరుకానున్నారన్నారు. రచయితలు కవి గాండీవి ఆత్రేయపురపు పాండురంగ విఠల్ ప్రసాద్, వేదుల కామేశ్వర శర్మలతోపాటు సమీక్షులుగా సాహితీ రత్న డాక్టర్ డి.వి.సూర్యారావు చేయనున్నారన్నారు. కార్యక్రమంలో అందరూ పాల్గోవాలని కోరారు.

కృష్ణా కళాశాల లైబ్రరీకి పుస్తకాల వితరణ

మద్దిలపాలెం: స్థానిక డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి రిటైర్డ్ గణిత ఉపాధ్యాయుడు జగన్నాథం మాస్టర్ తన సొంత నిధులు రూ.50 వేల విలువైన పుస్తకాలను వితరణ చేశారు. ఈ పుస్తకాలను గురువారం అందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ప్రముఖుల జీవితగాథలు, చారిత్రక గ్రంథాలు, తెలుగు సాహిత్య పుస్తకాలను ఇచ్చిన జగన్నాథం మాస్టర్ దాతృత్వం ఆదర్శనీయమని ఆయన కొనియాడారు. విలువైన ఈ పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచేందుకు కళాశాల గ్రంథాలయాధికారి శ్రీనివాస ప్రసాద్‌కు అందజేశామన్నారు. అధ్యాపకులు శ్రావణకుమార్, అకాడమీ అడ్వైజర్, రవిబాబు పాల్గొన్నారు.

రజత వస్త్రాలంకరణలో కన్యకాపరమేశ్వరి



ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపాన వెలసిన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మార్గశిర ఉత్సవాల సందర్భంగా గురువారం కన్యకాపరమేశ్వరిని రజత వస్త్రాలంకరణలో అలంకరించారు. అమ్మవారి మూల విరాట్‌కు ప్రాతఃకాల ప్రత్యేక పూజల అనంతరం 108 సువర్ణ పుష్పాలతో అర్చన, తామర గింజలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. దేవాలయ ఆస్థాన మండపంలో ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మచే సామూహిక కుంకుమ పూజలు జరిపారు. దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే నాలుగు గురువారాలు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు చెప్పారు. అలాగే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు బాదం నాగవెంకట కమలశ్రీ, కట్టమూరి ప్రసన్న, కడిమిశెట్టి దంతేశ్వరి, గ్రంధి దేవి, పాలూరి స్వర్ణలత, కొల్లూరు విశాల, గ్రంధి ఉష, కందుల గీతా ఆదిలక్ష్మి, పసుమర్తి హైమావతి పాల్గొన్నారు.

8న కొండగుడి భక్తులకు మహాన్నదానం



మాట్లాడుతున్న మక్సూద్ అహ్మద్

డాబాగార్డెన్స్: రౌండ్ టేబుల్ ఇండియా డబ్ల్యూఆర్ఆర్‌టీ356 ఆర్థిక సహకారంతో ఈ నెల 8న కొండగుడి పండగ సందర్భంగా భక్తులకు మహాన్నదానం నిర్వహించనున్నట్లు ఆంధ్ర, తెలంగాణ రౌండ్ టేబుల్ సంస్థ చైర్మన్ మక్సూద్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు గురువారం స్వామి వివేకానంద సంస్థలో సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. విశాఖపురి మేరీ మాత ఉత్సవానికి సుదూర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు కొండగుడికి తరలి రానున్న దృష్ట్యా మహాన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కొండగుడికి వచ్చే భక్తులు మహాన్నదానం స్వీకరిస్తారని కోరారు. ప్రతి సంవత్సరం స్వామి వివేకానంద సంస్థ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు, నిత్యం అన్నదానం నిర్వహిస్తున్న వివేకానంద సంస్థకు అభినందనలు తెలిపారు.

ఫైనల్ డయాగ్నోసిస్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ కరుణరాజు తదితరులు

మహారాణిపేట: విశాలాంధ్ర పుస్తక ప్రదర్శన ప్రాంగణంలో గురువారం సాయంత్రం విశాఖ అరసం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ ఎం.సుగుణాకరరావు రచించిన 'ఫైనల్ డయాగ్నోసిస్' పుస్తకావిష్కరణ జరిగింది. అన్వేక్షి ఉగాది నవలల పోటీలో ఈ నవల బహుమతి పొందింది. ఈ కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. కరుణరాజు ముఖ్య అతిథిగా హాజరు కాగా, సభకు అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు అధ్యక్షత వహించారు. అరసం విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు స్వాగతం పలుకగా ప్రముఖ కవి గరిమెళ్ల నాగేశ్వరరావు పుస్తకాన్ని సమీక్షించారు. ప్రముఖ కవి డాక్టర్ బండి సత్యనారాయణ పుస్తకాన్ని పరిచయం చేశారు. రచయిత డాక్టర్ సుగుణాకరరావు తన స్పందన తెలియజేశారు. అరసం కార్యవర్గ సభ్యులు బసుపోతన వందన సమర్పణ చేసిన ఈ కార్యక్రమంలో గూడురు సీతామహాలక్ష్మి, పలువురు రచయితలు, కవులు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు



తహసీల్దార్ రమేష్

సీతమ్మధార: ప్రజల సమస్యలు, భూ వివాదాల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని విశాఖ అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ వెల్లడించారు. సీతమ్మధారలో గల కార్యాలయంలో ఆయన 'సాక్షి'తో గురువారం మాట్లాడారు. ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 6న రేసపువానిపాలెం రెవెన్యూ విలేజీ ప్రాంత ప్రజలకు తమ కార్యాలయంలో, 9న మద్దిలపాలెం ప్రాంత ప్రజలకు 109వ నంబర్ సచివాలయం, 11న పెదవాల్తేరు ప్రాంత ప్రజలకు 99వ నంబర్ సచివాలయం, 13న చినవాల్తేరు ప్రజలకు ఎంవీపీ కాలనీ లుంబినీపార్కు ఏరియాలోని కల్యాణ మండపంలో, 16న వెంకోజీపాలెం వాసులకు ఎంవీపీ కాలనీ నేతాజీపార్కులో గల 105వ నంబర్ సచివాలయంలో, 18న దొండపర్తి ప్రాంత ప్రజల కోసం అక్కయ్యపాలెంలోని షాదీఖానాలో, 20న అల్లిపురం ఎక్స్‌టెన్సన్ వార్డు ప్రజలకు అక్కయ్యపాలెంలోని షాదీఖానాలో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. భూ సమస్యలకు సంబంధించిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సదస్సుల్లో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొంటారని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

టీడీపీ.. జనసేన మధ్య లొల్లి

- ఉత్సవ కమిటీ లేకుండానే మార్గశిర ఉత్సవాలు
- వంశీ.. సీతంరాజు మధ్య నలిగిపోతున్న కార్యకర్తలు
- ఎమ్మెల్యే ప్రతిపాదించిన 20 మందిలో 12 మంది జనసేన వారే
- తమ వారు కేవలం 8 మందేనా అంటూ సీతంరాజు గుర్రు
- ఎమ్మెల్యే పంపిన ప్రతిపాదనలకు చెక్

డాబాగార్డెన్స్: సాధారణంగా పెద్ద ఎత్తున నిర్వహించే ఏ ఉత్సవానికైనా ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేస్తుంటారు. అలాంటిది నెల రోజుల పాటు నిర్వహించే మార్గశిర మాసోత్సవాలకు ఉత్సవ కమిటీ లేకుండానే ఉత్సవాలు జరుగుతుండం విశేషం. అంటే టీడీపీ.. జనసేన మధ్య ఏ మేరకు అంతర్యుద్ధం జరుగుతుందో ఇట్టే తెలుసుకోవచ్చు. టీడీపీ–జనసేన మధ్య కోల్డ్‌వార్ నడుస్తుందనడానికి ఉత్సవ కమిటీ ఏర్పడకపోవడమే నిదర్శనం.

వివరాల్లోకి వెళ్తే.. నెల రోజుల పాటు జరిగే మార్గశిర మాసోత్సవాలకు సంబంధించి ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ 20 మంది సభ్యులతో కమిటీకి దేవదాయ శాఖకు ప్రతిపాదనలు పంపారు. అయితే ఆయన పంపిన 20 మందిలో 12 మంది జనసేన పార్టీకి చెందిన వారు.. మరో 8 మంది టీడీపీ/బీజేపీకి చెందిన వారే ఉండడంతో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎన్‌టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ మండిపడుతూ.. ఎమ్మెల్యే వంశీ పంపిన ప్రతిపాదనలకు బ్రేక్ వేసినట్టు తెలిసింది. వారం రోజుల కిందటే ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే పంపిన ప్రతిపాదనలకు వెంటనే సీతంరాజు సుధాకర్ చెక్ పెట్టినట్టు ఇరు పార్టీల కార్యకర్తలు కారాలు మిరియాలు నూరుకుంటున్నారు. ఇదిలా ఉండగా ఉత్సవాలు ప్రారంభమై ఐదు రోజులు కావస్తోంది. తొలి గురువారం పూజలు కూడా జరిగిపోయాయి.

అమ్మవారి ఉత్సవాల చరిత్రలోనే తొలిసారి..

మార్గశిర మాసంలో రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు సిరులతల్లి కనకమహాలక్ష్మిని దర్శించుకుంటారు. ఉత్సవాలకు సంబంధించి సేవలు నిర్వహించేందుకు ఉత్సవ కమిటీని ప్రతి ఏటా వేస్తుంటారు. ఈ ఏటా తెలుగుదేశం.. జనసేన మధ్య చిచ్చు మొదలవ్వడంతో ఉత్సవ కమిటీ ప్రతిపాదన వెనక్కి వెళ్లింది. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్.. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మధ్య సమన్వయ లోపం కారణంగా మార్గశిర మాసోత్సవాల చరిత్రలోనే తొలిసారిగా ఉత్సవ కమిటీ లేకపోవడం విశేషం. వాస్తవానికి ఉత్సవాల అభివృద్ధి పనులు స్థానిక ఎమ్మెల్యే కనుసన్నల్లోనే ఇంత వరకూ జరిగేవి. కానీ కూటమి ప్రభుత్వంలో టీడీపీ, జనసేన, బీజేపీ తైతక్కలతో కొంత వరకు ఎమ్మెల్యే వంశీ ఆదేశాలకు బ్రేక్ పడుతున్నట్టు కళ్లకు కట్టినట్టు కనిపిస్తోంది. టీడీపీ సభ్యత్వంలో చురుగ్గా ఉన్నవారికి ఉత్సవ కమిటీలో వేయాలని సుధాకర్.. మొన్నటి ఎన్నికల్లో కష్టపడిన వారినే నియమించాలని జనసేన కార్యకర్తల పేర్లను వంశీకృష్ణ సూచించారు.

నువ్వా..నేనా?

ఉత్సవ కమిటీని పక్కన పెడితే.. త్వరలో ఏర్పాటు కానున్న ట్రస్ట్ బోర్డులో తెలుగుదేశం పార్టీ నుంచి 35వ వార్డు అధ్యక్షుడు బుచ్చారామిరెడ్డి తనకు అవకాశం వస్తుందని ఆశిస్తుండగా.. జనసేన పార్టీ నుంచి ఇటీవల వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యే వంశీకృష్ణతో నిత్యం తిరుగుతున్న జెర్రిపోతుల ప్రసాద్ అవకాశం కోసం ఆశిస్తున్నారు. అంటే ఇక్కడ కూడా వీరిద్దరి మధ్య కోల్డ్‌వార్ నడుస్తోందని అర్థమవుతోంది.



మార్గశిర మాసోత్సవాలలో భాగంగా తొలి గురువారాన్ని పురస్కరించుకుని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నేక్) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ తెలిపారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగే ఈ శిక్షణకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు పదవ తరగతిలో ఉత్తీర్ణత కలిగి ఉండాలన్నారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం కింద ఇచ్చే ఈ శిక్షణ ఒక్కో అంశంలో మూడు నెలలు ఉంటుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాలలోపు వారు అర్హులని, ఇతర వివరాలకు 7989572891, 8500502395 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు. శిక్షణ అనంతరం సంబంధిత ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి రెవెన్యూ సదస్సులు

జగదాంబ: నేటి నుండి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు మహారాణిపేట తహసీల్దార్ సయ్యద్ మొహిద్దీన్ జిలానీ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు సదస్సుల నిర్వహణ ఉంటుందన్నారు. ఈ మేరకు 6, 10 తేదీల్లో మహారాణిపేట ప్రాంతం, 11,12 తేదీల్లో మార్కెట్ వార్డు, 17,18న అల్లిపురం, 19న పోర్టు వార్డు, 20,21 తేదీల్లో చెంగల్రావ్‌పేట, 24,26 తేదీల్లో శివాలయం వార్డు, 27, 28 తేదీల్లో వాల్తేర్ వార్డు, జనవరి 2న సీతారామయ్య టెంపుల్ వార్డు, 3న గోడేవారి వార్డుల్లో సదస్సులు జరుగుతాయని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్న సచివాలయ, పారిశుధ్య సిబ్బంది

అల్లిపురం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని 32వ వార్డు సిబ్బందితో కలిసి టీఎస్ఆర్ కాంప్లెక్స్ సచివాలయ సిబ్బంది వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. గురువారం ఉదయం వారు వార్డు పరిధిలో అమ్మవారివీధి, సౌత్ జైలురోడ్డు ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల పట్ల ఇంటింటికీ తిరిగి కరపత్రాలతో అవగాహన చేపట్టారు. ప్రతి ఇంట్లోను మూడు చెత్తబుట్టల విధానాన్ని అమలు చేయాలని సూచించారు. తడి, పొడి, ప్రమాదకర చెత్తను విడివిడిగా నిలువ చేయాలన్నారు. ప్రతి రోజు వచ్చే పారిశుధ్య సిబ్బందికి చెత్తను అందజేయాలని వివరించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా దోమలను నివారించవచ్చన్నారు. తద్వారా జ్వరాలను నివారించవచ్చన్నారు. జనవరి 1వ తేదీ నుంచి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్లాస్టిక్‌కు బదులు గుడ్డ సంచులను వాడాలని సూచించారు. పాలథిన్ కవర్లు వినియోగించినా, విక్రయించినా జరిమానా విధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన మార్గంలో కమిషనర్ పరిశీలన



సీఎం పర్యటించే మార్గాన్ని సుందరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశిస్తున్న కమిషనర్

డాబాగార్డెన్స్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించే మార్గంలో పారిశుధ్యం, విద్యుత్ దీపాలు తదితర పనులు పూర్తి చేసి రోడ్లు, పరిసర ప్రాంతాలు అందంగా తీర్చిదిద్దాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ప్రయాణించే విశాఖ ఎయిర్‌పోర్టు, కాకానినగర్, ఎన్ఏడీ, తాటిచెట్లపాలెం, న్యూకాలనీ, తెలుగుతల్లి ఫ్లైఓవర్, రాంనగర్‌లో గల టీడీపీ కార్యాలయం, నోవాటెల్, వీఎంఆర్‌డీఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో జీవీఎంసీ అధికారులతో కలిసి గురువారం కమిషనర్ పర్యటించారు. జాతీయ రహదారి కాకానినగర్ నుంచి రోడ్డు మార్గంలో ఉన్న చెట్ల కొమ్మలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని, ఎక్కువ విద్యుత్ కాంతి ఉండేలా చెట్ల కొమ్మలు తొలగించాలని డీడీహెచ్ దామోదరరావును ఆదేశించారు. అలాగే రోడ్డు పక్కనున్న వ్యర్థాలు తొలగించడంతో పాటు కాల్వలను శుభ్రపరచాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్‌ను ఆదేశించారు. సీఎం పర్యటించే మార్గంలో పశుసంచారణ లేకుండా చూడాలని సిటీ పశు వైద్యాధికారి కిషోర్‌కుమార్‌ను ఆదేశించారు. పర్యటనలో పర్యవేక్షక ఇంజనీర్లు సంపత్‌కుమార్, పీవీవీ సత్యనారాయణరాజు, జోనల్ కమిషనర్లు బి రాము, హేమావతి, వైద్యాధికారులు సునీల్‌కుమార్, డాక్టర్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య కార్డులు

సీతమ్మధార : రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం కింద పాఠశాల స్థాయి విద్యార్థులకు కార్డులు జారీ చేస్తున్నారు. ఈ మేరకు సీతమ్మధార దరి పీ అండ్ టీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా కార్డులు అందిస్తున్నారు. రేసపువానిపాలెంలోని పట్టణ ఆరోగ్య కేంద్రానికి చెందిన ఆశావర్కర్లు విద్యార్థుల పూర్తి వివరాలను ఆరోగ్య కార్డులో నమోదు చేసి ఇస్తున్నారు. పేరు, వయసు, తరగతి, ఆధార్ నంబర్ తదితర వివరాలు సమగ్రంగా నమోదు చేస్తున్నారు. ఈ కార్డులను పాఠశాలలోనే భద్రపరుస్తున్నారు. విద్యార్థులు పాఠశాల చదువు అయిపోయిన తర్వాత వారికి ఇస్తారు. ఎప్పుడైనా అనారోగ్యానికి గురైతే సదరు విద్యార్థులను ఆరోగ్య కేంద్రానికి సిఫారసు చేస్తారు. ఈ పాఠశాలలో 900 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు.